బౌద్ధనగర్ పార్కు ఇచట ఎవరికీ ప్రవేశం లేదు!

నిత్యం గేటుకు తాళం

- సందర్శకులకు అందుబాటులోకి రాని వైనం
- మున్సిపల్ సిబ్బంది సామగ్రి పెట్టుకునేందుకే అనుమతి
- వినియోగంలోకి తీసుకు రావాలంటున్న వాకర్స్
- విస్మరిస్తున్న ఆఫీసర్స్





గేటుకు తాళం వేసిన దృశ్యం

బౌద్ధనగర్: కాలనీలు, బస్తీలు అపార్ట్‌మెంట్ వాసులకు సేద తీరేందుకు చిన్న పిల్లలకు ఆడుకునేందుకు ఏర్పాటు చేస్తున్న పార్కులు అధికారుల నిర్లక్ష్యంతో వినియోగంలోకి రాకుండా పోతున్నాయి. బౌద్ధనగర్ డివిజన్‌లో ఇది వరకు అధ్వానంగా ఉన్న పార్కును ఆధునీకీకరించి వాకింగ్ ట్రాక్‌లు అద్భుతంగా వేశారు. ఎక్కడ చూసినా పచ్చదనం ఉట్టిపడేలా ఉన్నటువంటి ఆ పార్కులో ప్రజలకు ఎంట్రీ లేకపోవడం గమనార్హం. బౌద్ధనగర్ డివిజన్‌లోనే అందంగా ఉండే అలాంటి పార్కులో అన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ అందులో వాకింగ్ చేయడానికి, కాలక్షేపం చేయడానికి స్థానికులకు అనుమతి లేకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉరుకుల పరుగుల జీవితంలో కాసేపైనా ప్రశాంతంగా గడపాలని ఉదయం లేదా సాయంత్రం సమయాల్లో పార్కుకు వెళ్లాలి అనుకునే ఇక్కడి వారికి ఈ పార్కు అందుబాటులో ఉన్నా కూడా అందని ద్రాక్షగా మారింది.

సామగ్రి కోసమే..

ప్రజా జీవనానికి ఎంతో కాలక్షేపంగా మారాల్సిన పార్కులు కేవలం మున్సిపల్ సిబ్బంది పరికరాలు(తట్టా, పార, చీపుర్లు, చెత్త తరలింపు బండి)లకు మాత్రమే ఉపయోగపడుతుంది. ప్రతీరోజు తమ సామగ్రిని అందులో పెట్టుకొని తాళం వేసి వెళ్లే పారిశుద్ధ్య కార్మికులు తిరిగి వాటిని తీసుకునే సమయాల్లోనే పార్కు గేటు తెరుస్తారు. అనంతరం మళ్లీ తాళం వేసి వెళ్లి పోతుంటారు. ఇది నిత్యం పరిపాటగా మారింది. పార్కులు ఉన్నవి ప్రజల సేద తీరడానికి కాని, సామగ్రిని భద్ర పరచడానికి కాదని సంబంధిత అధికారులు గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అలంకార ప్రాయంగానే..



ప్రజలకు ఉపయోగపడని పార్కును తొలగించి ఉపయోగపడే ఇతర నిర్మాణాన్ని చేపట్టాలి. అధికారుల నిర్లక్ష్యంతో పార్కులోకి అనుమతి లేకుండా పోవడంతో అలంకార ప్రాయంగానే మారింది. ఎవ్వరికీ ఉపయోగపడని పార్కును తొలగించి దాని స్థానంలో కమ్యూనిటీహాల్ నిర్మిస్తే ఉపయోగకరంగా ఉంటుంది. కమ్యూనిటీ హాల్లో కొనసాగుతున్న పోలీస్ స్టేషన్‌ను ఈ పార్కు స్థలంలో నూతన భవనం ఏర్పాటు చేయొచ్చు. -పంపరి యాదగిరి

వినియోగంలోకి తీసుకురావాలి..



నెలల తరబడి పార్కు సమస్య ఇదే విధంగా ఉన్నదని అనేక మార్లు స్థానిక కార్పొరేటర్ కంది శైలజ, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ప్రజా సమస్యలను పట్టించుకోని నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నా లేకున్నా ఒక్కటే. ఇప్పటికైనా ప్రజలను పార్కులోకి అనుమతించే విధంగా చర్యలు తీసుకుంటే బాగుంటుంది. ఉదయం, సాయంత్ర వేళలో పార్కు గేట్ తెరిచి ఉంచితే ప్రజలకు పార్కులో కాలక్షేపంతో పాటు వాకింగ్ చేయడానికి అవకాశం ఉంటుంది. - బాదెపల్లి లక్ష్మణ్‌గౌడ్

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.19, నల్లవంకాయ 45, పొడుగు వంకాయ 45, బెండకాయ 55, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 70, పచ్చకాకర 55, పందిరి బీర 50, క్యాబేజీ 16, క్యారెట్ 35, దొండ 57, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 70, గోకరకాయ 50, కీర 19, దోసకాయ 28, బీట్‌రూట్ 28, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 23, చామగడ్డ 48, మొరంగడ్డ 23.

కుట్టు మెషిన్ల అందజేత



కుట్టు మెషిన్లు అందజేస్తున్న సురేషబాబు


లాలాపేట: లాలాపేటలోని శాంతినగర్ 51 మంది మహిళలకు కుట్టు మెషిన్లు పంపిణీ చేశారు. బుధవారం ఫ్రాన్సిలియన్ సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి సొసైటీ అధ్యక్షులు ఫాదర్ సురేష్ బాబు ముఖ్య అతిథిగా హాజరై అందజేశారు. సొసైటీ ద్వారా శాంతినగర్, లాలాగూడ పరిసర ప్రాంతాల మహిళల జీవనోపాధికి వివిధ వృత్తులలో శిక్షణ ఇచ్చి కుట్టు మెషిన్లు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో కిశోర్‌బాబు, సందీప్, ప్రశాంత్, ప్రసాద్ పాల్గొన్నారు.

శ్రీనయ్యకు డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ (సీఎస్‌సీ)లో బాదమోని శ్రీనయ్యకు పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. ప్రొ.వీబీ నరసింహ పర్యవేక్షణలో క్లౌడ్ కంప్యూటింగ్ అడాప్షన్ మోడల్ ఫర్ ఈ–గవర్నమెంట్ అనే అంశం పై పరిశోధనకు డాక్టరేట్ పట్టా అందుకున్నారు. డాక్టరేట్‌ను అందుకున్న శ్రీనయ్యను పలువురు అభినందించారు.

వైకుంఠ వెలుగులు





చిలకలగూడ: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని నామాలగుండు కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంతో పాటు పరిసర ప్రాంతాలు విద్యుత్ దీపాల వెలుగులతో దేదీప్యమానంతో ప్రకాశిస్తున్నాయి. ఈ నెల 23న ముక్కోటి ఏకాదశి రోజున సుమారు లక్షన్నర మంది భక్తులు ఉత్తర ద్వారం నుంచి స్వామివారిని దర్శించుకుంటారనే అంచనాతో తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఛైర్మన్ నోముల ప్రకాశరావు తెలిపారు. విద్యుత్ దీపాలతో రూపొందించిన సీతారాములు, వెంకన్న స్వామి, నారసింహుడు, గరుత్మంతుడు ఆకృతులతో పాటు పలు రకాల సెట్టింగ్‌లు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

ప్లాట్‌ఫామ్-65లో క్రిస్మస్ సందడి



సనత్‌నగర్: వంటకాల రుచులను ఆస్వాదించడమే కాదు..క్రిస్మస్ పండుగ ఆనందానుభూతులను పొందేలా ప్లాట్‌ఫామ్–65 ట్రైన్ రెస్టారెంట్లను తీర్చిదిద్దినట్లు మేనేజింగ్ డైరెక్టర్ సద్గుణ్ పాథా తెలిపారు. మొత్తం 11 బ్రాంచ్‌ల్లో క్రిస్మస్ థీమ్‌తో తమ రెస్టారెంట్లను ముస్తాబు చేయడం జరిగిందన్నారు. ప్లాట్‌ఫామ్–65 వైస్ ప్రెసిడెంట్ వెంకటేష్‌తో కలిసి బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రంగురంగుల స్టార్స్ (నక్షత్రాలు)తో క్రిస్మస్ ట్రీని అలంకరించామని ఇది సెల్ఫీ పాయింట్‌గా మారనున్నదన్నారు. అలాగే క్రిస్మస్ టోపీలతో పాటు పండుగ నేపథ్య దుస్తులను తమ సిబ్బంది ధరించి కస్టమర్లను స్వాగతం పలుకుతున్నట్లు వివరించారు. పిల్లల కోసం డ్రాయింగ్ పోటీ, వినోదాత్మక కార్యకలాపాలను నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం



బౌద్ధనగర్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధించుకుంటూనే రాజకీయ చైతన్యాన్ని నింపుకొని కమిటీలు ఏర్పాటు చేపట్టాలని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు టీవీ. నర్సింహా పిలుపునిచ్చారు. బుధవారం పార్శిగుట్టలోని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఎమ్మార్పీఎస్ గత ఉద్యమ నిర్మాణంలో భాగంగా ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు అందరూ బస్తీ కమిటీల నిర్మాణాన్ని తక్షణమే చేపట్టాలన్నారు. పని విభజన చేసుకొని ప్రతీ నియోజకవర్గాల్లో నూతన కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మహనీయులు కలలు కన్న స్వప్నాన్ని సాకారం చేసే దిశగా మహాజన రాజ్యాధికారం కోసం నడుం బిగించాలని కోరారు. ఈ సమావేశంలో ఎంఎస్పీ నాయకులు అజిత్‌వాల్మికి, డప్పు మల్లికార్జున్, అరుణ్, శ్రీకృష్ణ, వివ, శ్యాంసన్, రాజశేఖర్, రామకృష్ణ, వేణుగోపాల్, సునీల్, సుజాత, విజయ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై దృష్టి: ఎమ్మెల్యే తలసాని



తలసానికి శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు



ఎమ్మెల్యేను కలిసిన దేవీనగర్ కాలనీ ప్రతినిధులు

సనత్‌నగర్: నియోజకవర్గ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై దృష్టి సారిస్తున్నట్లు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. సనత్‌నగర్ డివిజన్‌లోని మోడల్‌కాలనీ, అల్లావుద్దీన్ కోఠి, రాజరాజేశ్వరీనగర్, అశోక్‌కాలనీ, జెక్‌కాలనీలకు చెందిన ప్రతినిధులు శశిధర్‌రెడ్డి, కరీంలాలా, సుధాకర్ రెడ్డి, బాలరాజ్‌గౌడ్, ప్రభాకర్, పుష్పలత, పద్మ, సరితగౌడ్, ఝాన్సీ, జాఫ్రీ మసీదు అధ్యక్షుడు నోమాన్, జమీర్, ఇబ్రహీం బుధవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే నివాసంలో కలిసి సత్కరించారు. అదే విధంగా బన్సీలాల్‌పేట డివిజన్ దేవీనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకటరమణ, అశోక్‌గౌడ్, అమర్నాథ్, అరుణ్‌గౌడ్, సత్యనారాయణ, మోండా డివిజన్ పద్మశాలీ సంఘం ప్రతినిధులు కంది విశ్వనాథం, రాఘవేంద్ర, జయరాజ్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

◆ ఇటీవల నూతనంగా ఎన్నికైన సనత్‌నగర్‌లోని జెక్‌కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు బుధవారం సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను వెస్ట్‌మారేడ్‌పల్లిలోని నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన అధ్యక్షుడు మల్లు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ చందు, కోశాధికారి శివారెడ్డిలతో పాటు ఇతర కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను కలిశారు.

సమస్యల పరిష్కారానికి కృషి..

పద్మారావునగర్: ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు నియోజకవర్గ వాసులకు నిరంతరం అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ దేవీనగర్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తన దృష్టికి వచ్చిన సమస్యలంనింటినీ ఎప్పటికప్పుడు పరిష్కరిస్తా అన్నారు. మంత్రిగా, ఎమ్మెల్యేగా నియోజకవర్గంలో చేపట్టి అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు తన విజయానికి సోపానాలుగా నిలిచాయన్నారు. ఈ కార్యక్రమంలో దేవీనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు వెంకటరమణ, నాయకులు అశోక్ గౌడ్, అమర్‌నాథ్, అరుణ్ గౌడ్, సత్యనారాయణ, ప్రవీణ్ పాల్గొన్నారు.

మర్యాద పూర్వక కలయిక



గాంధీఆస్పత్రి : తెలంగాణ వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కార్యదర్శిగా నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన క్రిస్టినా జెడ్ చొంగ్తును సికింద్రాబాద్‌గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొ. రాజారావు, మైక్రో బయోలజీ హెచ్‌ఓడీ ప్రొ. జ్యోతిలక్ష్మి బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను బహూకరించి శుభాకాంక్షలు తెలిపారు. గాంధీఆస్పత్రిలో అందిస్తున్న వైద్యసేవలు, కరోనా ముందస్తు ఏర్పాట్లను రాజారావు వివరించారు.

క్రిస్మస్‌ను సంతోషంగా నిర్వహించుకోవాలి



మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

అడ్డగుట్ట: క్రైస్తవులందరూ క్రిస్మస్ పండగను సంతోషంగా జరుపుకునే విధంగా ప్రభుత్వం అన్ని విధాలుగా ఏర్పాటు చేస్తుందని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వేణు మాధవ్ అన్నారు. బుధవారం అడ్డగుట్టలోని మారేడుపల్లి మండల కార్యాలయంలో క్రిస్మస్ సెలబ్రేషన్స్ ఆర్గనైజింగ్ కమిటీ ఆధ్వర్యంలో చర్చి పాస్టర్లు, అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ వేణు మాధవ్ మాట్లాడుతూ.. క్రైస్తవ సోదరి, సోదరిమణులు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించుకునేందుకు ప్రభుత్వం తమవంతు సహాయంగా చెక్కులతో పాటు గిఫ్ట్ ప్యాకెట్లు కూడా పంపిణీ చేస్తుందని తెలిపారు. అందులో భాగంగా సికింద్రాబాద్ నియోజకవర్గంలో మొత్తం 8 చర్చిలను ఎంపిక చేశామని, ఒక్కో చర్చికి రూ.1 లక్ష చెక్కుతో పాటు 500 గిఫ్ట్ ప్యాకెట్లను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ చర్చిల ద్వారా మిగతా చర్చిలకు కూడా గిఫ్ట్‌లు అందజేస్తామని వివరించారు. ఈ సమావేశంలో జీహెచ్‌ఎంసీ యూసీడీ డీపీఓ శ్రీనాథ్, సీఓలు ఉమ, ప్రేమ్‌చంద్, శ్రీవాణి, చర్చిల పాస్టర్లు, అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో ఎదగాలి



జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ముదిరాజ్ నాయకులు

బన్సీలాల్‌పేట్: ముదిరాజ్ కులస్తులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆ దిశగా ముందుకు సాగాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. బుధవారం బోయిగూడ ముదిరాజ్ సంఘంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో బోయిగూడ ముదిరాజ్ భవనం నిర్మించి 20 ఏళ్ల పూర్తయిన సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో నగర నలుమూలల నుంచి అనేక మంది ముదిరాజ్ కులస్తులు, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సదానంద్, శ్రీనివాస్, శ్రీకాంత్, సురేందర్, నీలం శ్రీనివాస్ మాట్లాడారు. ముదిరాజ్ కులస్తులు విద్యా, ఆర్థిక, సామాజిక, రాజకీయపరంగా మరింత శక్తిమంతులు కావాలన్నారు. ముదిరాజ్ కులస్తులను బీసీ–డీ నుంచి 'ఏ' గ్రూప్‌లోకి మార్చాలని డిమాండ్ చేశారు. ఎంతో కాలం నుంచి ముదిరాజ్‌లు గ్రూప్ మార్పు సమస్యను ఎదుర్కొంటున్నారని కాసాని జ్ఞానేశ్వర్ నాయకత్వంలో ముదిరాజ్ కులస్తుల అభివృద్ధికి నిరంతరం పోరాడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్, నరేష్, దివాకర్, భాగ్యలక్ష్మీ, లక్ష్మీనారాయణ, వెంకన్న, మధు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ



స్థానికులతో మాట్లాడుతున్న హేమ

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్‌లో నెలకొన్న ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నట్లు కార్పొరేటర్ సామల హేమ తెలిపారు. సంబంధిత అధికారులతో కలిసి మంగళవారం ఆమె శ్రీనివాస నగర్, నామాలగుండు, ఉప్పరిబస్తీ, అయిమాత మందిరం, ఫ్రైడే మార్కెట్, సవరాలబస్తీ, బీదలబస్తీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో పాదయాత్ర చేపట్టి స్థానికులతో మాట్లాడారు. రహదారులు, వీధి దీపాలు, డ్రైనేజీ, మంచినీరు, పారిశుద్ధ్యం తదితర సమస్యలను ఆమె దృష్టికి తేగా, సంబంధిత అధికారులతో చర్చించి దశలవారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. శ్రీనివాస నగర్ మసీదులైన్‌లో నూతనంగా విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయాలని సూచించారు. కార్పొరేటర్ వెంట జీహెచ్‌ఎంసీ ఏఈ కౌశిక్, వీధి దీపాల పర్యవేక్షకుడు శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకుడు కరాటే రాజు, ఆయా బస్తీవాసులు ఉన్నారు.

ఇల్లు అద్దెకు తీసుకుంటానని రూ. 84,412 స్వాహా

అడ్డగుట్ట: నో బ్రోకర్ హౌసింగ్ యాప్ ద్వారా పరిచయమైన ఓ వ్యక్తి ఇల్లు అద్దెకు కావాలని చెప్పి రూ. 84,412 స్వాహా చేసిన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ దయాకర్ వివరాల ప్రకారం..అడ్డగుట్టకు చెందిన నర్సింహా (46) ప్రైవేట్ ఉద్యోగి. తన ఇంట్లో సింగిల్ బెడ్రూమ్ ఖాళీగా ఉందని, అద్దెకు ఇస్తానంటూ నో బ్రోకర్ హౌసింగ్ యాప్‌లో పోస్ట్ పెట్టాడు. ఈ నెల 11న గుర్తు తెలియని వ్యక్తి నర్సింహాకు ఫోన్ చేసి తాను ఆర్మీ ఉద్యోగినని, రూమ్ అద్దెకు కావాలని చెప్పి ఆర్మీ ఐడీ కార్డుతో పాటు ఆధార్ కార్డు పంపించాడు. అడ్వాన్స్ పంపుతానని చెప్పి ముందుగా నర్సింహాకు రూ.5 ఫోన్‌పేలో పంపించమని చెప్పాడు. నిజమని నమ్మిన నర్సింహా రూ.5 అతని యూపీఐ నంబర్‌కు పంపాడు. ఆ తరువాత రూ.10 ఇంటి యజమాని అకౌంట్‌కు వచ్చాయి. ఆ తర్వాత పలు దఫాలుగా నర్సింహా అకౌంట్ నుంచి రూ. 84,412 కట్ కావడంతో మోసపోయినట్లు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అధికారులులేని వార్డు కార్యాలయాలు ఎందుకు?

కార్పొరేటర్ ఆగ్రహం



అధికారులను నిలదీస్తున్న కార్పొరేటర్ కొంతం దీపిక

రాంగోపాల్‌పేట్: హంగూ, ఆర్భాటాలతో ఏర్పాటు చేసి ఇప్పుడు ఎందుకు పనికిరాకుండా పోయిన వార్డు కార్యాలయాలు ఎందుకని మోండా మార్కెట్ కార్పొరేటర్ కొంతం దీపిక ప్రశ్నించారు. బుధవారం ఆమె రెజిమెంటల్‌బజార్‌లో కొనసాగుతున్న వార్డు కార్యాలయాన్ని పరిశీలించగా కేవలం జలమండలికి చెందిన అధికారి మాత్రమే కనిపించారు. దీంతో అధికారుల తీరుపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో అధికారులు ఎన్నికల విధుల్లో ఉన్నా ఇప్పటికీ వార్డు కార్యాలయాలకు రాకపోవటం ఏంటని ప్రశ్నించారు. అన్ని శాఖల అధికారులు ఉండి ప్రజల సమస్యలు స్వీకరించి పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన వార్డు కార్యాలయాలు ఎందుకు పనికిరాకుండా పోతున్నాయన్నారు. రూ.లక్షల్లో వెచ్చించి నిర్మించిన భవనంలో వార్డు కార్యాలయం ఏర్పాటు చేశారని కానీ ఇప్పుడు అధికారుల నిర్లక్ష్యంతో ఎందుకు పనికిరాకుండా పోయిందన్నారు. గతంలో ఇదే భవనంలో బస్తీ దవాఖానా పెట్టి ప్రజలకు వైద్య సేవలు అందించాలని ప్రయత్నించామని కానీ ఇప్పుడు వార్డు కార్యాలయంతో నిరుపయోగంగా మరిందన్నారు.

లాడ్జి బాత్రూమ్‌లో వ్యక్తి మృతి

రాంగోపాల్‌పేట్: ఉపాధి కోసం నగరానికి వచ్చిన ఓ వ్యక్తి లాడ్జి బాత్రూమ్‌లో మృత్యువాత పడిన ఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా దొనకొండకు చెందిన షేక్ ఆసిఫ్ అలీ (45), అస్సాంకు చెందిన హేమంత్‌రాయ్ గతంలో నర్సరావుపేటలో సెక్యూరిటీ గార్డుగా పనిచేసే వారు. ఇద్దరు అక్కడ ఉద్యోగాన్ని వదిలేసి హైదరాబాద్‌లో పని చేసేందుకు బుధవారం ఉదయం నగరానికి వచ్చారు. సెక్యూరిటీ ఏజెన్సీకి చెందిన వ్యక్తులు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్రాంతంలోని లోటస్ గ్రాండ్ హోటల్‌లో ఉండి ఇంటర్వ్యూకు రావాలని చెప్పడంతో హోటల్‌కు వచ్చారు. ఉదయం గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న కామన్ బాత్రూమ్‌కు వెళ్లిన షేక్ ఆసిఫ్ అలీ ఎంతకీ బయటకు రాలేదు. తలుపులు పగలగొట్టి చూడగా ఆసిఫ్ అలీ అచేతనంగా పడి ఉన్నాడు. పోలీసులకు సహాయంతో దగ్గరకు వెళ్లి పరిశీలించగా మృతి చెంది ఉన్నాడు. గుండెపోటుతో మరణించి ఉండొచ్చని భావిస్తున్నారు.

చికిత్సకు వచ్చిన బాలిక అదృశ్యం



సాయిపూజ

చిలకలగూడ: వైద్యచికిత్స కోసం సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి వచ్చిన బాలిక అదృశ్యమైంది. చిలకలగూడ ఎస్‌ఐ కిషోర్ తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ మదీనాగూడకు చెందిన సాయిపూజ (14) అమీర్‌పేటలోని ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ స్టేట్ హోమ్‌లో ఆశ్రయం పొందుతుంది. ఈ నెల 18వ తేదీన సాయిపూజను వైద్యచికిత్స కోసం సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తీసుకువచ్చారు. వెంట వచ్చిన అంగరక్షకురాలు అవుట్ పేషెంట్ విభాగం వద్ద చిట్టీ కోసం వెళ్లిన సమయంలో బాలిక ఆస్పత్రి నుంచి బయటకు వెళ్లి పోయింది. పరిసర ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఫలితం లేకపోవడంతో వెల్ఫేర్ హోమ్ ప్రతినిధి పీవీఎల్ ప్రవీణ చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



సదస్సులో ప్రసంగిస్తున్న పళనివేల్

అమీర్‌పేట: ఆధునిక సాంకేతికతను విద్యార్థులు అంది పుచ్చుకోవాలని తమిళనాడు రాష్ట్ర సమాచార, ఐటీ శాఖ మంత్రి పళనివేల్ త్యాగరాజన్ అన్నారు. ఐసీటీ అకాడమీ ఆధ్వర్యంలో అమీర్‌పేటలోని గ్రీన్‌పార్క్ మ్యారీగోల్డ్ హోటల్‌లో బుధవారం బ్రిడ్జి–23 సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. స్థిరమైన ఆర్థిక వృద్ధి, మానవ మూలధనాన్ని నిర్మించుకోవడం, వృద్ధిని వేగవంతం చేయడం వంటి అంశాలు దేశ, సామాజిక ప్రగతికి కారణాలవుతాయని అన్నారు.అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దిన కోర్సులపై దృష్టి సారించాలని సూచించారు. ఇందుకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత విద్యా సంస్థలపై ఉందన్నారు. పెరుగుతున్న జనాబా, ఆర్థిక అవసరాల దృష్ట్యా విద్యా నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని స్పష్టం చేశారు. భవిష్యత్ అవసరాలకు ఉపయోగపడే కోర్సులపై విద్యార్థులకు శిక్షణ ఇవ్వడంతో పాటు వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న ఐసీటీ అకాడమీ సేవలను అభినందించారు. దేశ వ్యాప్తంగా ప్రతి యేడాది పారిశ్రామిక, విద్యావేత్తలు, విద్యార్థులకు శిక్షణనిస్తూ ఆర్థిక ప్రగతికి దోహదపడటం గొప్ప విషయంగా అభివర్ణించారు. ఐసీటీ అకాడమీ సీఈఓ హరిబాలచంద్రన్, ఛైర్మన్ ఫాల్కన్, జాతీయ ప్రతినిధి గణేష్ కార్తిక్, ఆంధ్రప్రదేశ్ చాప్టర్ ప్రతినిధి దివాకర్‌రెడ్డి, హైదరాబాద్ చాప్టర్ ప్రతినిధి శ్రీనివాస్య పాల్గొన్నారు.

వార్షిక వేడుకలు.. అబ్బురపర్చిన ప్రదర్శనలు







లిటిల్ స్కాలర్ స్కూల్ వార్షిక వేడుకలు సందడిగా జరిగాయి. సంప్రదాయ కూచిపూడి నృత్యాలు కామెడీ స్కిట్స్, థీమ్ సాంగ్స్, పంచతత్వ పేరిట నిర్వహించిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఉస్మానియా యూనివర్సిటీ ఏఎంఎస్ ఉపాధ్యక్షుడు డాక్టర్ జీఎల్‌కే దుర్గ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదల, సమయపాలనను అలవర్చుకుంటే లక్ష్యాలను ఛేదిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ పురుషోత్తంరావు, ప్రిన్సిపాల్ సునీత, సెక్రటరీ సిద్ధార్థ్ పాల్గొన్నారు. - సనత్‌నగర్

నూతన నటులకు వినోద్ ఫిలిం అకాడమీ మంచి వేదిక

బంజారాహిల్స్: వినోద్ ఫిల్మ్ అకాడమీ దిన దిన ప్రవర్ధమానమై మరింతగా ఎదగాలని ప్రముఖ పారిశ్రామికవేత్త సినీ నిర్మాత, డాక్టర్ పుట్టగుంట వెంకట సతీష్ అన్నారు. ప్రసాద్ లాబ్స్‌లో జరిగిన వినోద్ ఫిల్మ్ అకాడమీ తృతీయ వార్షికోత్సవంలో ఆయన ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. ఒడిదుడుకులు ఎదుర్కొన్నప్పుడే విజయం వరిస్తుందని ప్రముఖ నటుడు దర్శకుడు శ్రీదేవి ప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ దర్శకుడు శివ నాగేశ్వరరావు మాట్లాడుతూ... అకాడమీతో తన అనుబంధాన్ని వివరించారు. నటుడు ప్రదీప్ మాట్లాడుతూ... నటనలో ఉండే టెక్నిక్ ను పట్టుకోవాలని అన్నారు. వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని ప్రముఖ దర్శకుడు ఎ.మోహన్‌గాంధీ విద్యార్థులను ఆశీర్వదించారు. దొరసాని చిత్ర దర్శకుడు శ్రీ కేవీఆర్ మహేంద్ర మాట్లాడుతూ... తాను ఎల్లప్పుడూ కొత్త నటులకు అవకాశం ఇస్తూ ఉంటానని ప్రకటించారు. సినీ పరిశ్రమలో కోటి మంది మాత్రమే ఉంటారని అందులో తాము ఉండటం ఎంతో అదృష్టమని మాటల రచయిత లక్ష్మీ భూపాల్ అన్నారు.